# అగ్గిబుగ్గ

లవలి

ఇదిగో!

ఇదే గోదావరి!

ఇది అనాది నుండీ ఎన్నెన్నో కథలు తన కన్నుల ముందే జరిగిపోతూ వుంటే చూడలేక నిలువెల్లా కరిగి నీరయి పోయింది.

అవిగో!

అవే పాపి కొండలు!

అవి గోదావరి అలలు చెప్పే కథలకు వూఁకొట్టలేక మండే గుండెలను భరించలేక చల్లని మబ్బుల్లోకి దూసుకు పోతున్నాయి.

ఈ గోదావరి చూపులు ప్రసరించే చోట- ఆ పాపికొండల నీడలు పరుచుకొనే చోట- కారడవి కాపురం చేస్తోంది.

అందులో వున్నది వక చిన్న గుడిస. ఆ గుడిస లోపల పొయ్యి మండుతోంది. దాని మీద కందిపప్పు వుడుకుతోంది.

ఆ పప్పు పొంగి పొరలి గిన్నె అంచులు దాటి పొయ్యిలో పడిపోతోంది.

అక్కడే ఆ పొయ్యికి దగ్గరగా నులక మంచం మీద కూర్చొని వున్నాడు మూర్తి.

అతని కళ్ళు ఆ పొయ్యిలాగే మండుతున్నాయి. నిన్న రాత్రి నుండీ మనస్సు మనస్సులో లేదు మూర్తికి.

పప్పునీళ్ళు పొంగి చుయ్ మనే శబ్దంతో పొయ్యి చల్లారి పోతూ వుంటే- అప్రయత్నంగా లేచి కట్టెలు కదిపి మళ్ళీ మంట చేశాడు. మళ్ళీ పొంగుతూ వుంటే గిన్నెలో ఇన్ని నీళ్ళు పోసి వచ్చి కూర్చున్నాడు అదే నులక మంచం మీద తడికకి జార్లపడి.

మూర్తి యీ అడవిలో రెండు నెలల నుండీ వుద్యోగం చేస్తున్నాడు. కాలేజీ జులాయి తిరుగుడు విడిచి పెట్టి అయిదాతేళ్ళయినా ఆ వాసనలు ఇంకా పూర్తిగా వదల లేదు మూర్తిని.

ఇక్కడ యీ వుద్యోగం చేస్తూ ఈ అడవి బతుకు బతకడం కన్నా చావడం మేలనుకున్నాడు చాలా సార్లు. అయినా ఇంతకన్నా గత్యంతరం లేదు మరి తనకి. అందుకే బతికి వుండీ చచ్చిన వాడిలాగే బతికేస్తున్నాడు.

తను డిగ్రీ చదువులు వెలగబెట్టే రోజుల్లో ఆడింది ఆటగా పాడింది పాటగా గడిచి పోయింది కాలం.

మగపిల్లలే కాదు. ఆడపిల్లలు కూడా తన చుట్టూ ముసురుకునే వారు. తనని వక హీరోని చేసి ఆరాధించేవారు.

వాళ్ళతో ఎన్ని రకాలుగా ఆడుకునే వాడు తను!

ఫ్రెండ్సు గురించి తను పెదవి విప్పితే చాలు మంత్ర ముగ్ధులైపోయి తన వెంట పడి రంగు హో రంగుల ఊహాలోకాల్లో విహరించే వాళ్ళు.

ఆ రోజుల్లో తనే తనకి గుర్తుండేవాడు కాదు. ఇంక ఇంటి సంగతి చెప్పనే అక్కర్లేదు!

అసలు ఇంటి పట్టునే వుండేవాడు కాదు తను. ఒకవేళ వున్నా ఆ కొద్ది క్షణాల్లో తన తల్లి కన్నీళ్ళు తనకి వినబడేవికావు. వాళ్ళు తన ముందు పెదవి విప్పి మాట్లాడటానికే భయపడే వాళ్ళు- ఆ కాసేపయినా తను వాళ్ళ కళ్ళ ముందు వుండకుండా వెళ్ళి పోతాడేమోనని.

బి.ఎ. పట్టా చేతో పట్టుకొని నిరుద్యోగ పర్వంలో అడుగు పెట్టిన తర్వాత తెలిసింది- తను చదువు పేరుమీద చేసిన అప్పు ఎంతో? అదిపోగా ఇంక మిగిలిన తన బతుకేఁవిటో?

మిత్రుడు సూర్యం ఈ అడివిలో కూపు కాంట్రాక్టు తీసుకోవడం వల్లా, వాడికి తన మీద జాలి కలగడం వల్లా ఈ ఉద్యోగం దక్కింది.

ఆ రోజు సూర్యం తొలిసారిగా తనని ఇక్కడికి తీసుకు వచ్చినప్పుడు ఈ అడివీ- ఇక్కడ బిక్కు బిక్కు మంటూ ఈ గుట్ట పక్కన పడివున్న ఈ రెండు గుడిసెలూ చూసి అందులో వక గుడిసలో తను గడపబోయే వంటరి జీవితం తలుచుకుని ఎంత భయపడ్డాడని! ఎంత యేడ్చాడని!

అయితే సూర్యం తనకి చాలా ధైర్యం చెప్పాడు. భవిష్యత్తు మీద ఆశపెట్టాడు.

"వరే మూర్తి! నీకు వూరికే డబ్బు లెవరిస్తార్రా? నాకు మాత్రం అంత వుదార గుణం లేదు. ఇప్పుడు కష్టపడ్డావో ముందు ముందు సుఖపడతావు. ఈ వుద్యోగం చేస్తూ ఈ వ్యాపారంలో అనుభవం సంపాదించు. అదే నీ భవిష్యత్తును బాగు చేస్తుంది. ఎప్పుడూ ఇల్లాగే వుండి పోతానేమో! ఈ కూలీలకి మస్తరు వేసుకుంటూ ఈ కలప నరికిస్తూ ఈ వుద్యోగంలోనే ముసలాడ్నయి పోతానేమో అని అనుకోకు...."

సూర్యం ఎన్ని చెప్పినా పులిగాడు లేకపోతే తనసలు ఈ అడివిలో వక్క క్షణం వుండలేక పోయేవాడు.

పులిగాడు పాపం మూగవాడు. సైగలతో వాడికన్నీ చెప్పవచ్చు. వాడి సైగలూ అర్థం చేసుకోవచ్చు.

వాడు ఈ అడివిలోనే పుట్టాడు. ఈ అడివిలోనే పెరిగాడు. ఈ అడివంతా వాడికి పరిచయఁవే!

వకసారి వాడు పెద్దపులితో ముఖాముఖీ పోరాడి దాన్ని చంపేశాడట!

వాడు మన పక్కన వుంటే మనల్ని చూసి పులులే భయపడతాయి. అసలే ఈ అడివిలో పులు లెక్కువ. ఎక్కడ ఏ పొదలో పులి నక్కి వుందో తెలియదు. అందుకే పులిగాడు లేకుండా వంటరిగా తను ఎక్కడికి వెళ్ళడు.

పులిగాడు నల్లగా పోత పోసిన ఉక్కు విగ్రహంలా వుంటాడు. ఎప్పుడూ బుజం మీద గొడ్డలి వేసుకుని తిరుగుతూ వుంటాడు.

పులిగాడికి ఈ మధ్యే పెళ్ళయింది ముత్తితో వీళ్ళిద్దరూ మూర్తి వున్నదానికి పక్కన వున్న గుడిసలో వుంటున్నారు.

ముత్తి వానా కాలంలో కొండవాగులా వురికేస్తుంది.

పెదకొప్పు పెట్టి ఆ కొప్పులో అడివి మల్లెల్ని తురిమి విప్పపూవులు ఏరుతూ వుంటే దాని నడుము చూడాలి!

నదురూ బెదురూ లేకుండా చెట్టెక్కి జుంటి తేనె పిడతలోకి పిండుతూ వుంటే దాని కళ్ళు చూడాలి!

వాగులో స్నానం చేసి ఎదమీద ఏదీ లేకుండా నీళ్ళ కడవ నెత్తిన పెట్టుకొని వస్తూ వుంటే దాని నీలిమేని నిగనిగలు చూడాలి!

"ఇలావర్ర" (ఇటురా) అని కొండ వాగులా అది భర్తని పిలిచేటప్పుడు దాని గొంతు వినాలి!

అడివిలో పళ్ళు ఏరుకొచ్చి తనకి ఇస్తూ "నన్న నిమ్మ చుట్టామే" (నేనూ నీవూ చుట్టాలమే) అని పలికేటప్పుడు దాని చిరునవ్వులోని నిర్మలత్వం గుర్తుంచుకోవాలి!

ఈ అడివిలో రకరకాల పువ్వులు పూస్తున్నాయి. మత్తెక్కించే పరిమళాలు వెదజల్లుతున్నాయి. కానీ ఆ పూల తీగలు- నింగిని తాకుతూ భయం గొలిపే చెట్లకు పాకి వుంటాయి. ముత్తి కూడా ఆ పువ్వులలో వక పువ్వే! దానికి ఆశపడ కూడదు అని అనుకున్నాడు తను నిన్నటిదాకా.

కానీ నిన్న రాత్రి నుండీ తన మనస్సు మనస్సులో లేదు.

అది తలుచుకో కూడదని ఏవేవో తలచుకుంటున్నా సరే అదే తలపుకు వస్తోంది.

అది తలపుకు రాగానే తన మెదడులో భూకంపం పుడుతుంది. తన గుండెల్లో సముద్రాలు పొంగుతాయి. తన ఆలోచనల్లో పెను తుఫాన్లు చెలరేగుతాయి. తన రక్తనాళాల్లో బడబాగ్ని ప్రవహిస్తోంది.

అదే అది....

నిన్న రాత్రి విప్పచెట్టు కింద వత్తుగా రాలిపడివున్న విప్పపూల పాన్పు మీద ముత్తి- పులిగాడూ దిగంబరంగా జరిపే శృంగారకేళి....

వాళ్ళ మీద పైనుండి రాలిపడే విప్పపూవులూ- కొమ్మల సందుల్లో నుండి వాళ్ళ మీద జారిపడే వెన్నెల తీగలూ కలిసి పెన వేసుకు పోయేయి.

ముత్తి అరమోడ్పు కళ్ళూ- ఆమె నుదుటి మీది స్వేద బిందువులూ- పులిగాడి వీపుమీద విచలితములయ్యే ఆమె చేతి వేళ్ళూ....

కళ్ళు మూసినా కళ్ళు తెరిచినా తనకి ప్రత్యక్షమై

తన ప్రాణాలు తోడేస్తున్నాయి.

"వరే! మూర్తి ఒక్క విషయం బాగా గుర్తుంచుకో! కలలో కూడా పులిగాడిని మోసం చేయకు. వాడికి రవ్వంత అనుమానం నీమీద వచ్చిందో ఇంక నువ్వుండవ్!"

సూర్యం తన నిక్కడ వదిలి వెడుతూ మళ్ళీ మళ్ళీ



చేసిన హెచ్చరిక పోలీసు సైరన్లా తన చెవుల్లో మారుమోగుతోంది.

రాత్రి తెల్లవార్లూ నిద్ర లేదు తనికి. తెల్లారినా రాత్రీ పగలూ వకలాగే వుంది తనకి.

ముత్తీ పులిగాడూ పొద్దున్న కూపుకిపోతూ తనని పిలిచారు. వాళ్ళకేం తెలుసు తన ఇప్పటి మానసిక స్థితి? తను రావడం లేదని వాళ్ళని పంపేశాడు. అప్పుడు పులిగాడి మొహంలోకి చూడలేక పోయాడు తను.

తను మామూలు మనిషి అయ్యేది యెట్లా? ఇదే ఆలోచనతో పొద్దు గుంకిపోయింది.

ఈ పూటేనా ఇంత తిందామని అన్నం వండి పప్పు పడేశాడు పొయ్యిమీద.

పప్పు మాడు వాసన వేస్తోంది. ముందు ఈ ఆకలి తీర్చుకోవాలని లేచి పప్పు దింపుకున్నాడు పొయ్యిమీంచి మూర్తి.

మాడి – కాటోయిన ఆ కందిపప్పుతోటే తిన్నాడు.

అప్పటికి చీకట్లు ముసురుకుంటున్నాయి. అడవి మేలుకొనేవేళ అవుతోంది.

ముత్తీ పులిగాడూ కూపునుండి తిరిగి వచ్చేశారు.

# అగ్గిబుగ్గ

వాళ్ళ అలికిడి విని మూర్తి గుడిసలోంచి బయటకు వచ్చాడు.

పులిగాడు ఏవేవో సైగలు చేస్తూ ఆ రోజు కూలీలు ఎంత మంది మానేశారో లెక్కలు చెప్పి తన గుడిశలోకి వెళ్ళిపోయాడు.

మూర్తి వక్కడే బయట మిగిలాడు.

గుడిశ ముందు నిలబడి చూస్తూ వుంటే అల్లంత దూరంలో వున్న విప్ప చెట్టు కింద నిన్న రాత్రి దృశ్యమే సజీవచిత్రంలా ఇంకా కనబడుతోంది మూర్తికి. అందులో పులిగాడి రూపానికి తన వేషం వేసుకుంటున్నాడు మూర్తి.

విప్ప చెట్టుకి పక్కనే వున్న గుట్టమీద పెద్దపులి గాండ్రించింది. మూర్తి వక్కసారి ఉలిక్కిపడి మళ్ళీ సర్దుకున్నాడు. ఆ అడివిలో రాత్రివేళ పులి-గాండ్రింపులు మామూలే అయినా ఆ పులి గాండ్రింపు మామూలుగా అనిపించడం లేదు మూర్తికి. అందుకే పులిగాడి గుడిశలోకి చూశాడు వాడ్ని పిలుద్దామని.

పులిగాడు విప్పసారా రోజూకంటే కొంచెం ఎక్కువ పట్టించి నట్టుంది. వాడు వంటిమీద సోయి లేకుండా పడి వున్నాడు. ముత్తి వాడిచేత అంబలి తాగించడానికి విఫల ప్రయత్నం చేస్తోంది.

"ముత్తి!"

సన్నగా వణుకుతోంది మూర్తి గొంతు.

"యేంది దొర!" అంబలి బుర్ర చూరుకి తగిలించి గుడిశ బయటకు వచ్చింది ముత్తి.

"ఇలావర్ర" ("ఇటురా") కొంచెం ధైర్యం చేశాడు మూర్తి.

"వాతానూ" ("వస్తున్నా") అంటూ ముత్తి మూర్తి దగ్గరకి వచ్చింది. మూర్తి నవ్వేడు ఆమెని గుచ్చి గుచ్చి చూస్తూ. ముత్తి కూడా నవ్వింది బదులుగా. మెల్లగా విప్ప చెట్టు దగ్గరికి దారి తీశాడు మూర్తి అతని వెనకనే వెళ్ళింది ముత్తి.

జల్లెడలో నుండి జారిపడే ముత్యాల్లా వుంది అక్కడి వెన్నెల.

మూర్తి మొహంలోకి చూస్తూ "ఎందుకు" అని కళ్ళతోటే ప్రశ్నించింది ముత్తి.

అతను ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ఆమె అయోమయంగా చూసింది. ఆమె వళ్ళంతా తన రెండు చేతులతోనూ నిమిరాడు. ఆమె మొహంలో అర్థంకాని నవ్వు.

గభాలున ఆమెని గుండెలకు హత్తుకొని తన బాహువుల్లో ఆమెని బంధించాడు.

అతని వంట్లోంచి వచ్చే సెగల పొగలు ఆమెకు అర్థమయ్యాయి అంతే! "మావో" అంటూ పాపి-కొండల్లో మారుమోగేలా కేకపెట్టింది.

ఆ కేక విప్పసారా మైకంలో వున్న పులిగాడి గుండెల్లోంచి దూసుకు పోయింది. వాడి మైకం దిగజారి పోయింది.

ఏ క్రూర మృగమో ముత్తిని పట్టిందని- చేతి కందిన గొడ్డలి తీసుకొని బయల్దేరాడు.

ఎదురుగా మూర్తి- అతని కౌగిలిలోంచి విడిపించుకుందుకు ప్రయత్నిస్తున్న ముత్తి- ఈ దృశ్యం చూసి ప్రళయకాల రుద్రుడయి పోయాడు పులిగాడు. పులి లాగ గాండ్రించాడు. అదే సమయంలో గుట్టమీద పెద్ద పులి కూడా గాండ్రించింది.

గొడ్డలి ఎత్తిపెట్టి మీద పడబోతూ వున్న పులిగాడ్ని చూశాడు మూర్తి.

అతని కళ్ళ పొరలు డుల్లి పోయెయి. వళ్ళంతా మంచు ముద్దలా అయిపోయింది.

తన చెల్లీ, తన తల్లీ కళ్ళ ముందు మెదిలారు. తనని నీచాతి నీచంగా అసహ్యించు కుంటున్న-ట్టున్నాయి వాళ్ళ మొహాలు.

అప్పటికే అతని చేతుల్లోంచి విడివడి పులిగాడి వెనక చేరింది ముత్తి. గొడ్డలి ఎత్తిపెట్టిన వాడి కుడిచేయి బుజంమీద తన చేయివేసి వాడ్ని ఆపడానికి ప్రయత్నం చేస్తోంది ఆమె

పులిగాడు మూర్తి కళ్ళల్లో కన్నీటి పొరలు చూస్తున్నాడు. వాడు మెలి తిరిగిన తన చేతుల కండలు చూసుకుంటున్నాడు. తల విదిలించి గొడ్డలి ఎడం చేతిలోకి మార్చుకున్నాడు. తన కుడిచేయి చూపుడు వేలూ, దాని పక్క వేలూ రెండూ మూర్తికి చూపిస్తూ- ఆ రెండు వేళ్ళనూ వక దానితో వకటి తాడించి ఒక వేలు ముడిచి వేసి మిగిలిన వేలితో తన వెనుక నున్న ముత్తిని తాకి చూపించాడు.

మూర్తి యీ సైగలు అర్థం చేసుకునే స్థితిలో లేడు

అదే సమయంలో మూర్తికి పులిగాడికి మధ్యన వక లేడి చెంగున దూకి దూరంగా పొదల్లోకి పారి పోయింది

లేడి వచ్చిన దిక్కుగా గుట్టమీద పొదలు ఒక్కసారిగా కదిలాయి. అటు చూసింది ముత్తి

వెంటనే పులిగాడి చూపులు గుట్టమీదికి మళ్ళించడానికి వాడి కళ్ళముందు తన చూపుడు వేలు ఆడించి గుట్టకేసి తిప్పింది.

అంతే!....

భూనభోంతరాళాలు దద్దరిల్లి పోయేలా పెద్ద పులి గాండ్రించడం- పిడుగు పడినట్లు పులిగాడు అరవడం- ఎడమ చేతిలోని గొడ్డలి కుడి చేతిలోకి మార్చుకోవాలని అనుకుంటూనే పులిగాడు ఒక్క ఎగురు ఎగిరి మూర్తిని మెడపట్టి పక్కకి తోసేయడం- ఇవన్నీ ఒకేసారి జరిగి పోయేయి.

కిందపడి తన ఆఖరి క్షణాలు లెక్కపెట్టు-కుంటున్నాడు మూర్తి

ఆ మరుక్షణం మెరుపులా వచ్చి పులిగాడి మీద దూకింది పులి. దూకడం దూకడం వాడి రెండు బుజాలమీదా పంజా దెబ్బలు కొట్టి మెడలో తన కోరలు దించింది

దానికి వాడి మీద చాలా కసిగా వుంది. తన నోటికి చిక్కాల్సిన లేడి వాడి మూలానే చిక్కకుండా పోయిందని. అసలు కారణం ఎవరో దానికేం తెలుసు?

పులి పంజాదెబ్బ తనమీద పడటానికి ముందే తన ఎడం చేతిలోని గొడ్డలితో పులి వెనక కాళ్ళు రెండూ నరికేశాడు.

ఈ బాధకి తాళలేక పులి పంజా విప్పి పులిగాడి గుండెలమీద వేసింది.

పులిగాడు తనని ఏ వుద్దేశ్యంతో కిందకు తోసేశాడో ఇప్పు డర్థమయ్యింది మూర్తికి. ఆ పులి తనమీదే దూకినట్లు తలుచుకొని వణికి పోతున్నాడు.

తన గుండెల మీద పడిన పంజాదెబ్బకి చిమ్మిన రక్తం చిమ్ముతూ వుంటే మహావేగంతో గిర్రున విష్ణుచక్రంలా తిరిగాడు పులిగాడు.

ఆ వేగానికి తన పట్టు తప్పి కింద పడిపోయింది పులి.

చేతిలో గొడ్డలి పులిమీదకి విసిరేసి నేల కొరిగిపోయాడు పులిగాడు.

పులి తల ఎగిరి వెళ్ళి ముత్తి ముందు పడింది. తన తలే ఎగిరి నేలమీద పడినట్లుగా అనిపించింది మూర్తికి. రాత్రంతా గోదావరి ఏడుస్తూనే వుంది.

పాపికొండల గుండెలు మండుతూనే వున్నాయి.

తూర్పు కొండ కడుపు చీల్చుకొని అగ్గిబుగ్గ పుడుతోంది. □

